క్లుప్తంగా

ఆళ్లగడ్డ టౌన్ సీఐగా చిరంజీవి



ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ పట్టణ సీఐగా చిరంజీవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈయన పోరుమామిళ్ల సర్కిల్ సీఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇన్నాళ్లు ఇక్కడ సీఐగా పనిచేస్తున్న రమేష్‌బాబు కొలిమిగుండ్లకు బదిలీపై వెళ్లారు. కాగా కొత్త సీఐ మాట్లాడుతూ ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు

ఆళ్లగడ్డ: పట్టణంలోని ప్రముఖ హోటళ్లు, కుష్కా, బిర్యానీ పాయింట్ సెంటర్లలో మంగళవారం ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలను ఉల్లంఘిస్తూ కొన్ని తినుబండారాలను అమ్ముతున్నట్లు గుర్తించారు. అలాగే ఆహార పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించని హోటల్ యజమానులకు ఫుడ్‌సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ వెంకటరాముడు నోటీసులు జారీ చేశారు.

సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

ఉయ్యాలవాడ : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన రెవెన్యూ సంబంధ అర్జీలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలు, జనన, మరణ సర్టిఫికెట్ల దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. మట్టి మిద్దెల్లో నివాసం ఉంటున్న గృహ యజమానులను అప్రమత్తం చేయాలని వీఆర్‌ఓలను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ తులసిక్రిష్ణ, సీనియర్ అసిస్టెంట్ అంకన్న, సర్వేయర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థుల సమస్యలపై ఆందోళన



నంద్యాల(న్యూటౌన్): హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రతాప్, ధనుంజయుడు మాట్లాడుతూ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని, కాస్మోటిక్ బిల్లులు విడుదల చేసి మెస్ చార్జీలు పెంచాలన్నారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయమైన హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం డీఆర్‌ఓ పద్మజకు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, ఎర్రిస్వామి, ఉదయ్, మనోజ్, దినేష్, వినోద్, తరుణ్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

దొర్నిపాడు: రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ సుభద్ర సూచించారు. మంగళవారం ఆమె స్థానిక కార్యాలయంలో వీఆర్‌ఓలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు సంబంధించిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ఎలాంటి ఆలస్యం చేయకుండా అప్రూవ్ చేయాలన్నారు. అలాగే రైతుల మ్యూటేషన్లు మరే ఇతర పెండింగ్ పనులు ఉన్నా తన దృష్టికి తీసుక రావాలన్నారు. కార్యక్రమంలో టీటీ రవి, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి

దొర్నిపాడు: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ శ్రీనివాసులు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులకు మంగళవారం సూచించారు. నీటి నిల్వలు ఉన్నచోట దోమలు వ్యాప్తి చెందుతాయని, అక్కడ వెంటనే వేస్ట్ ఆయిల్ చల్లించాలన్నారు. అలాగే గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను ప్రతి రెండు వారాలకు ఒకసారి శుభ్రపరచాలని ఆదేశించారు.

నాణ్యమైన విత్తనాలివ్వాలి

నంద్యాల(వ్యవసాయం): రైతులకు నాణ్యమైన విత్తనాలు, సబ్సిడీపై డ్రిప్‌పరికరాలు అందేలా చూడాలని భారతీయ జనతా కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు తాడి రామకృష్ణారెడ్డి మంగళవారం జేసీ విష్ణుచరణ్‌ను కలిసి విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాగునీటి సమస్య తలెత్తకుండా జిల్లాలోని అగనూరు, గోరుకల్లు రిజర్వాయర్లను వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చ నాయకులు హేమ సుందర్‌రెడ్డి, భూమా రాజశేఖర్‌రెడ్డి, శివరామిరెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు చట్ట సవరణలు సరికాదు

నంద్యాల(వ్యవసాయం): వక్ఫ్‌బోర్డు చట్ట సవరణలు చేస్తూ కేంద్ర కేబినెట్ ఆమోదించడాన్ని పట్టణ ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్లు ఎండీ అబులైజ్, అబ్దుల్‌సమ్మద్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం స్థానిక క్రాంతిరేఖ గ్రంథాలయంలో ముస్లిం ప్రజా సంఘాల ఐక్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో సవరణలు జరగాలన్నారు. కేబినెట్ నిర్ణయాన్ని పార్లమెంట్‌లో వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. సవరణల పేరిట కోట్ల విలువైన ముస్లిం వక్ఫ్ ఆస్తుల స్వాధీనానికి కేంద్రం కుట్రలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మౌలానా అబ్దుల్‌సలాం, ఫాజిల్ దేశాయ్, పాస్టర్ జానయ్య మన్నెం, బాబాఫకృద్దీన్ పాల్గొన్నారు.

సన్నగిల్లుతున్న ఆశలు



ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్న దస్తగిరి దంపతులు దొర్నిపాడులో ఎకరానికి రూ.55వేలు ముందస్తు కౌలు చెల్లించి ఐదు ఎకరాలు తీసుకొని విత్తన పత్తిని నాటారు. నాటే ముందు విస్తారంగా వర్షాలు కురిశాయి. తర్వాత వరుణదేవుడు కరుణించకపోవడంతో ఇలా రోజు బిందెలతో నీటిని తెచ్చుకుని మొక్కలకు పోస్తున్నారు. లేదంటే మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉందంటున్నారు. వీరి దయనీయ పరిస్థితి చూస్తుంటే కన్నీటితో మొక్కలను తడుపుతున్నట్లు ఉంది.



ఇక్కడ చిత్రంలో కనిపిస్తున్న వరినారు కేసీ కెనాల్ కింద పోశారు. కేసీ కింద ప్రతి ఏటా రైతులు ప్రధాన పంటగా వరిని సాగు చేస్తారు. కానీ కేసీకి నీరు పూర్తి స్థాయిలో రాలేదు. దీంతో ఇప్పటి వరకు ఒక ఎకరం కూడా నాటు పడలేదు.

- ఆందోళనలో రైతన్నలు
- వాడుతున్న ఖరీఫ్ పంటలు
- చివరి ఆయకట్టుకు అందని సాగునీరు
- అడుగులోతు కూడా పారని కేసీ
- ఇంకా మొదలవ్వని వరి నాట్లు





రామచంద్రాపురంలోని 25వ లాక్‌వద్ద అడుగంటిన కేసీకెనాల్, దొర్నిపాడు సమీపంలో నీటి తడి లేక వాడు పట్టిన మినుము పైరు

దొర్నిపాడు: ఖరీఫ్‌సాగుకు ముందు వర్షాలు విస్తారంగా కురిశాయి. దీంతో రైతులు ఎన్నో ఆశలతో ముందస్తు పంటలుగా మినుము, పత్తి, మిరప, కంది, మొక్కజొన్న సాగు చేశారు. విత్తు మొలచిన తర్వాత వరుణుడు ముఖం చాటేయడంతో పంటలు వాడు ముఖం పట్టాయి. కనీసం కేసీ నీటితోనైనా వాటిని తడుపుకుందామంటే నీరు పారని పరిస్థితి. వేలాది రూపాయల పెట్టుబడి మట్టిపాలవుతోందని రైతన్నలు దిగాలు చెందుతున్నారు.

ప్రస్తుతం ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు ఎక్కడ చూసినా జలాశయాలు నిండి తొనుకుతున్నాయి. కానీ కేసీకి మాత్రం పూర్తి స్థాయిలో సాగునీరు రావడం లేదు. ప్రస్తుతం దొర్నిపాడు మండలంలోని 22వ లాక్ వెంకటేశ్వరనగరం వద్ద రెండు అడుగుల లోతులో పారుతుండగా 25వ లాక్ వద్ద రామచంద్రపురంలో కేవలం అర అడుగు కూడా నీరు ప్రవహించక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సంతజూటురు వద్ద కుందూకు 10వేల క్యూసెక్కులు వెళ్తుండగా కేసీకి మాత్రం 740 క్యూసెక్కులకు మించి పారడం లేదు. అక్కడి నుంచి కనీసం 13 వందల క్యూసెక్కుల నీరు వదిలితేగానీ మండలంలో 3 అడుగుల నీటిమట్టంతో కేసీ పారదని అన్నదాతలు వాపోతున్నారు.

రెండు వారాలుగా చినుకు కునుకు

గత రెండు వారాలుగా చినుకు కునుకు తీయడంతో మండలంలో సాగుచేసిన మినుము, పత్తి, మొక్కజొన్న, కంది, మిరప పంటలు వాడుముఖం పడుతున్నాయి. కేసీ వైపు చూస్తే అందులో నీరు పూర్తిస్థాయిలో ప్రవహించక పోవడంతో చివరి ఆయకట్టు పొలాలకు సాగునీరు వెళ్లడం లేదు. ఏం చేయాలో తెలియక పత్తి రైతులు పంటను కాపాడుకునేందుకు బిందెలతో నీటిని తీసుకెళ్లి మొక్కలను తడుపుతున్నారు.

ప్రారంభంకాని వరినాట్లు

మండలంలో పత్తితో పాటు వరి ప్రధాన పంట. ఏటా కేసీ కింద వెయ్యి హెక్టార్లకు పైగా వరి సాగవుతుంది. అయితే, ఈసారి ఆ ఊసే లేదు. కేసీకి నీళ్లు వస్తాయనే ఆశతో మండలంలోని చాలా మంది రైతులు వరినారు వేశారు. నారు పెరిగి పెద్దగైంది. అయినా, కెనాల్‌కు పూర్తి స్థాయిలో నీరు రాకపోవడంతో నాట్లు వేసుకోలేని పరిస్థితి. పొలాలు బీళ్లుగా మారాయి. ఈ విషయాన్ని కేసీ కెనాల్ ఏఈ రమేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లగా జుటూరు వద్ద పాతుల వాగు, మధ్యవాగుల షట్టర్లు దెబ్బతినడంతో నీరు సరిగా రావడం లేదని, త్వరలోనే పూర్తిస్థాయి నీరు కెనాల్‌కు వస్తుందని చెప్పారు.

మండలంలో సాగైన పంటల వివరాలు

పంటలు	సాధారణ సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	సాగయిన విస్తీర్ణం (హెక్టార్లలో)
మినుము	740	795
పత్తి	1022	475
కంది	120	50
మొక్కజొన్న	5	6
వేరుశనగ	28	21
మిరప	388	45

సాగు నీరు అందించాలి



ప్రస్తుతం మాకు పూర్తిస్థాయిలో వర్షం కురవక పోయినా కేసీకి నీరు వస్తుంది. కానీ అది పూర్తి స్థాయిలో ప్రవహించక పోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వరిసాగుకు నారు సిద్ధంగా ఉంచుకున్నాం. కేసీలో నీటిమట్టం పెరిగితే పంటలకు అందుతుంది. అధికారులు స్పందించి సాగునీరు అందించాలి.

–నాగప్ప, వెంకటేశ్వరనగరం

ఐదెకరాల్లో పత్తి నాటాను



నేను ప్రస్తుతం ఐదు ఎకరాల్లో పత్తి పంట సాగుచేశాను. ఎకరం రూ.60 వేలు వెచ్చించాను. ప్రస్తుతం కేసీకి సాగునీరు రావడంలేదు. పోనిలే వర్షం కురుస్తుందా అంటే అదిలేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు. కేసీకి పూర్తిస్థాయిలో సాగు నీరు వస్తే పంటను తడుపుకోగలుగుతాం. లేకపోతే నష్టపోవాల్సి వస్తుంది.

–తిమ్మయ్య, రామచంద్రాపురం

పెద్ద ఎత్తున పంద్రాగస్టు వేడుకలు

- ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాట్లు చేయండి
- జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్

నంద్యాల: ఈనెల 15వ తేదీ స్వాతంత్య్ర వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో స్వాతంత్య్ర వేడుకల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలన్నారు. ప్రజల్లో దేశభక్తి భావాలు పెంపొందించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. కళాశాల మైదానాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలన్నారు. జాతీయ పతాక ఆవిష్కరణ, సాయుధ దళాల మార్చ్ ఫాస్ట్, వేదిక, బ్యాక్ డ్రాప్, వీఐపీ సీటింగ్ తదితర ఏర్పాట్లపై ప్రత్యేక చొరవ చూపాలని ఆర్‌డీఓ, పోలీసు అధికారులను ఆదేశించారు. దేశభక్తి ఉట్టిపడేలా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. డీఆర్‌డీఏ, హౌసింగ్, వైద్యం, డ్వామా, వ్యవసాయం, అనుబంధ రంగాలు, సంక్షేమ శాఖలు ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శనలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే ఆయా శాఖలు ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. వేడుకల నిర్వహణకు సంబంధించి అధికారులకు అప్పగించిన విధులను చివరి వరకు ఉండకుండా ముందుగానే పూర్తి చేసుకోవాలన్నారు. జిల్లా అభివృద్ధిపై సందేశ బుక్‌లెట్‌ను సిద్ధం చేయాలన్నారు. స్వాతంత్య్ర సమరయోధులకు, జిల్లా ప్రజాప్రతినిధులకు, అధికారులకు వేర్వేరుగా సీటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. ఆహ్వాన పత్రికలను ప్రోటోకాల్ ప్రకారం ముందుగానే పంపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాల జారీకి జాబితాను సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ ప్రవీణ్ కుమార్, డీఆర్‌ఓ పద్మజ, ఆర్‌డీఓ మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిల్పా సేవాసమితి సేవలు కొనసాగుతాయి

- మాజీ ఎమ్మెల్యే శిల్పా రవి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పారవి

బొమ్మలసత్రం: నంద్యాలలో తాము గెలిచినా ఓడినా శిల్పా సేవసమితి సేవలు కొనసాగుతాయని మాజీ ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి అన్నారు. మంగళవారం శిల్పా మహిళా సహకార్ బ్యాంకు ద్వారా 135 మంది మహిళలకు అతి తక్కువ వడ్డీకి రూ. 21.18 లక్షల రుణం అందజేశారు. అలాగే టైలరింగ్‌లో శిక్షణ పొందిన 20 మందికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా పట్టణంలో శిల్పా సేవాసమితి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 13 ఏళ్ల నుంచి శిల్పా మహిళా సహకార్ బ్యాంకు ద్వారా అతితక్కువ వడ్డీలకు రుణాలు అందజేస్తూ మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. అయితే, టీడీపీ నాయకులు శిల్పా సేవాసమితి ఆధ్వర్యంలో చేస్తున్న సేవాకార్యక్రమాలను ఆపేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. శిల్పా సహకార్ సూపర్ మార్కెట్‌ను, ఉచిత మినరల్ ప్లాంట్లను మూసేయాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. గెలుపు ఓటములతో సంబంధం లేకుండా తాము ప్రజలకు సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో శిల్పా మహిళా సహకార్ బ్యాంక్ డైరెక్టర్ పూర్ణిమ, మేనేజర్ హరిలీల, శిల్పా సేవాసమితి సిబ్బంది లక్ష్మీనారాయణ, సహదేవుడు, మహిళలు పాల్గొన్నారు.

పంట పొలాల్లో చిరుత సంచారం

- భయాందోళనలో రుద్రవరం గ్రామస్తులు

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరానికి సమీపాన పంట పొలాల్లో చిరుత సంచరిస్తోంది. దీంతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. రుద్రవరానికి చెందిన రైతులకు ఎక్కువగా నల్లమల అటవీ ప్రాంతానికి దగ్గరలో పొలాలు ఉన్నాయి. ఆ పొలాల్లో మామిడి, నిమ్మ వంటి ఉద్యాన పంటలతో పాటు వరి, మినుము, వేరుశనగ, మొక్కజొన్న వంటి పంటలు సాగు చేస్తున్నారు. ఆ పొలాల్లో వ్యవసాయ పనుల నిమిత్తం వందలాది మంది రైతులు, కూలీలు వెళ్లి వస్తుంటారు. రెండు రోజుల క్రితం తెలుగుగంగ ప్రధాన కాల్వ నుంచి మోటార్ సైకిల్‌పై ముగ్గురు కూలీలు ఇంటికి వస్తుండగా చిరుత రోడ్డు దాటి మామిడి తోటలోకి వెళ్లింది. గమనించిన వాహనదారులు ఈ విషయం గ్రామస్తులకు తెలిపారు. ఇటీవల గుట్టకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ పరిసరాల్లో గొర్రెల మందపై చిరుత దాడి చేసి ఓ మేకను ఎత్తుకెళ్లింది. ఇలా కొద్ది రోజుల నుంచి గ్రామానికి దగ్గరలోని పంట పొలాల్లో చిరుత సంచరిస్తుండటంతో రైతులు, కూలీలు అటువైపు వ్యవసాయ పనులకు వెళ్లేందుకు జంకుతున్నారు. అటవీ అధికారులు స్పందించి చిరుతను అడవిలోకి తరమాలని గ్రామస్తులు కోరారు.

అడిగేవారు లేరని..

- 11 గంటలు దాటినా కార్యాలయానికి రాని మున్సిపల్ సిబ్బంది
- పట్టించుకోని ఉన్నతాధికారులు



11.25 గంటలకు అసిస్టెంట్ కమిషనర్ చాంబర్‌లో దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు



11.26కు మేనేజర్ చాంబర్‌లో అటెండర్ మినహా మిగతావారెవరు కనిపించని దృశ్యం

నంద్యాల(సిటీ): మున్సిపల్ కార్యాలయ సిబ్బంది వారికి ఇష్టం వచ్చినప్పుడు విధులకు హాజరవుతున్నారు. పలువురు సమయ పాలన పాటించడం లేదు. మంగళవారం ఉదయం 11.20 గంటలకు కూడా కార్యాలయంలోని పలు విభాగాల్లో ఖాళీ సీట్లు దర్శనమిచ్చాయి. వివిధ పనుల మీద వచ్చిన ప్రజలు ఉద్యోగులు లేకపోవడంతో వెనుదిరిగిపోయారు. మున్సిపల్ కార్యాలయంలోని సచివాలయాల మానిటరింగ్ సెల్, 43వ సచివాలయాన్ని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఉదయం 11 గంటలు దాటినా అందులోని ఉద్యోగులు విధులకు హాజరుకాలేదు. మేనేజర్ చాంబర్‌లో కూడా దాదాపు ఇదే పరిస్థితి. మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ చాంబర్‌లో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ఆడిట్ డిపార్ట్‌మెంట్‌లో కూడా ఖాళీ కుర్చీలు కనిపించాయి. టౌన్ ప్లానింగ్ విభాగంలో టీపీఎస్(టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్) శివుడు నాయక్ లేకపోవడంతో ఆయన కోసం వచ్చిన పలువురు నిరాశతో వెనుదిరిగిపోయారు. సిబ్బంది వేళకు కార్యాలయంలో ఉండి ప్రజలకు సేవలందించేలా కమిషనర్ చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి శ్రావణమాసాన్ని పురస్కరించుకొని మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాళికాంబ మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పట్టు వస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలతో పూలంగి సేవ నిర్వహించారు. అమ్మవారికి వడిబియ్యం వేసి, 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయం ఈఓ లక్ష్మీనారాయణ, తదితర భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని పార్కురోడ్డులో వెలసిన శ్రీలక్ష్మీగణపతి ఆలయ ప్రతిష్టాపన వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజనసేవ నిర్వహించి పట్టువస్త్రాలచే అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం గణపతి హోమాన్ని నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు, అన్న ప్రసాదం పంచారు. కార్యక్రమంలో వేదపండితులు మాడుగుల నాగేంద్రశర్మ, ప్రతాప్‌శర్మ, సుమశ్రీరవి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

40 లీటర్ల నాటుసారా స్వాధీనం

బొమ్మలసత్రం: నంద్యాల సెబ్ పోలీస్టేషన్ పరిధిలోని పాణ్యం మండలం పిన్నాపురం గ్రామంలో మంగళవారం సెబ్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. నాగేషు అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 40 లీటర్ల సారాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. దాడుల్లో సెబ్ ఎస్‌ఐ శంకర్, హెచ్‌సీ ఫాజల్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ఆళ్లగడ్డ: పట్టణంలోని ఎల్‌ఎం కాంపౌండ్‌కు చెందిన సురేష్(34) ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతను మంగళవారం అతిగా మద్యం తాగి ఆ మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నగీన తెలిపారు.

ఈరోజు

మండల సర్వసభ్య సమావేశం

గోస్పాడు: మండల సర్వసభ్య సమావేశం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ ఆర్థర్ సైమాన్ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగఅనసూయ తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరవుతారని మండల అధికారులు వారి శాఖల అభివృద్ధి నివేదికలతో రావాలని సూచించారు.

సంక్షిప్తం

మెరుగైన వైద్య సేవలందించాలి

శిరివెళ్ల: వైద్య సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పీహెచ్‌సీ డాక్టర్ ముఖేష్ అన్నారు. ఆ పీహెచ్‌సీ సూపర్‌వైజర్ అమినాబీకి పబ్లిక్ హెల్త్‌ఆఫీసర్‌గా పదోన్నతి వచ్చింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఆమెను డాక్టర్, సిబ్బంది సత్కరించారు. సీహెచ్‌ఓ రాంమోహన్‌రెడ్డి, స్టేట్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ దస్తగిరి, నంద్యాల తాలూకా ఎన్జీవో ప్రెసిడెంట్ మణిశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పంట నమోదు చేసుకోవాలి

ఉయ్యాలవాడ : సాగు చేసిన పంటలను రైతులు నమోదు చేయించుకోవాలని ఏఓ రాజేంద్రకుమార్ సూచించారు. మంగళవారం మాయలూరు గ్రామం రైతు సేవా కేంద్రంలో పొలంబడి కార్యక్రమానికి హాజరై రైతులతో మాట్లాడారు. గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నమోదు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. అలాగే సాగు చేసిన పంటల్లో తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకోవాలని సూచించారు.

పంట యాజమాన్య పద్ధతులు పాటించాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఆళ్లగడ్డ: రైతులు పంట యాజమాన్య పద్ధతులు పాటించి మంచి దిగుబడులు సాధించేలా మండల వ్యవసాయాధికారులు కృషిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీ క్రిష్ణ సూచించారు. మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రం యాగంటి వారు ఆళ్లగడ్డ డివిజన్ రైతు సేవా కేంద్రం సిబ్బందికి యాజమాన్య పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఏఓ మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులకు నూతన సాంకేతికతను అందించాలన్నారు. కేవీకే సీనియర్ శాస్త్రవేత్త మరియు హెడ్ ఇన్‌చార్జ్ రమయ్య పంటల్లో చేపట్టాల్సిన పురుగు, తెగుళ్ల యాజమాన్యం, భూసార ఆధారిత ఎరువుల వినియోగం, పోషకలోపాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సేద్య విభాగ శాస్త్రవేత్త సుధాకర్, సస్యరక్షణ శాస్త్రవేత్త బాలరాజు, ఉద్యానవన శాస్త్రవేత్త ఆదినారాయణ, కేవీకే సొసైటీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి సురేష్‌కుమార్, శాస్త్రవేత్త రవిగౌడ్, ఆళ్లగడ్డ, చాగలమర్రి, రుద్రవరం, గోస్పాడు, శిరివెళ్ల మండల ఏఓలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

బొమ్మలసత్రం: చెడు సావాసాలతో మాదక ద్రవ్యాల జోలికి వెళ్లవద్దని సెబ్ సీఐ విశ్వనాథ్‌రెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై సీఐ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పిల్లల కదలికలపై తల్లిదండ్రులు నిఘా వేసి ఉంచాలన్నారు. విద్యార్థులు చెడు స్నేహితులతో స్నేహం చేస్తున్నారని తెలిస్తే పెద్దలు మందలించాలని వివరించారు. తమ పిల్లలు ఇప్పటికే చెడు స్నేహాలు, మాదక ద్రవ్యాల అలవాటు కలిగి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వారికి కౌన్సిలింగ్ ఇచ్చి సన్మార్గంలో నడిపే బాధ్యత పోలీసులదన్నారు. కార్యక్రమంలో కాలేజ్ వైస్ ప్రిన్సిపాల్ శైలజారాణి, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు, లెక్చరర్లు విజయానంద్, శశికళ, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పీఎస్సీ, కేవీ ఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మంగళవారం ఎన్ఎస్ఎస్ యూనిట్, వ్యాయామ విద్యావిభాగం ఆధ్వర్యంలో యాంటి డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శైలజరాణి మాట్లాడుతూ యువత మత్తుకు బానిస కాకూడదన్నారు. దీని వల్ల జీవితాలు నాశనమవుతాయన్నారు. అలాగే డ్రైవింగ్ సమయంలో హెల్మెట్ వాడాలన్నారు. సీఐ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ మత్తుకు యువత అలవాటు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

పల్లెల అభివృద్ధికి సహకరించాలి

- మండల సర్వ సభ్య సమావేశంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రుద్రవరం: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ సహ కరించాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ మబ్బు బాలస్వామి అధ్యక్షతన ఎంపీడీఓ రామచంద్ర మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశా నికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయమని, తర్వాత అభివృద్ధి వైపు దృష్టి సారించాలన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గ సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి నిధులు మంజూరు చేశారన్నారు. ఆ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. వ్యవసాయ శాఖ పరంగా ప్రభుత్వం నుంచి వచ్చే ఎరువులు, విత్తనాలు వంటివి రైతులకు సక్రమంగా అందేలా చూసుకోవాలని, పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యవంతమైన భోజనం వడ్డించాలని లేదంటే ఏజెన్సీలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉండటంతో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి వైద్య సేవలందించాలన్నారు. అక్కడక్కడ అసంపూర్తిగా నిలిచిన ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులను త్వరలో పూర్తి చేయిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దారు రవీంద్ర ప్రసాదు, ఆయా శాఖల అధికారులు,ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

బిడ్డకు తల్లిపాలు ఔషధం



రుద్రవరంలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



పోలూరులో వాల్‌పోస్టర్ విడుదల దృశ్యం

నంద్యాల(అర్బన్): తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి ఉంటుందని పుట్టిన వెంటనే తాపితే బిడ్డకు ఔషధంగా పనిచేస్తుందని చాపిరేవుల పీహెచ్‌సీ వైద్యురాలు ఉదయ సంధ్య అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నంద్యాల మండలం పోలూరు గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణ ప్రసవమైతే పుట్టిన అరగంటలోపు, సిజేరియన్ అయితే 4 గంటల్లోపు తల్లిపాలు పట్టించాలని, ముర్రుపాలలో ఔషధ గుణాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం జెన్నీ, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకు ముందు వారు వారోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్ విడుదల చేశారు.

ఉయ్యాలవాడ : బిడ్డకు తల్లి పాలు మించిన ఔషధం మరొకటి లేదని వైద్యాధికారిణి అపర్ణ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద తల్లిపాల వారోత్సవాలపై చేపట్టిన ర్యాలీని మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ జెండా ఊపి ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ తల్లి పాలు బిడ్డ ఆకలిని తీర్చడంతో పాటు పోషకాలు, రోగ నిరోధక శక్తిని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘురాం, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మహిళలు తల్లి పాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహించారు. పుట్టిన బిడ్డకు తల్లిపాలు ముద్దు అని డబ్బా పాలు వద్దని పలుకుతూ గ్రామంలోని పలు కాలనీల్లో ర్యాలీ నిర్వ హించారు.